నగరంలో-నేడు

- బంగ్లాదేశ్‌లో హిందువులపై దాడిని ఖండిద్దాం.. హిందువులకు బాసటగా నిలబడుదాం.. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో మధ్యాహ్నం 1 గంటలకు సమావేశం
- వయనాడ్ - ఉత్తరాఖండ్ - హెచ్‌పీ - హైదరాబాద్‌లో ప్రకృతి విపత్తులు..? మ్యాన్‌మేడ్ ఫెల్యూయర్స్..? అనే అంశాలపై జనవిజ్ఞాన వేదిక స్టేట్ కమిటీ ఆధ్వర్యంలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు రౌండ్ టేబుల్ సమావేశం
- తెలంగాణ స్టేట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ, జువెనైల్ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో హైకోర్టు సీ బ్లాక్ ఆవరణలో ఉదయం 10 గంటలకు హ్యాండ్లూమ్ ఆర్టికల్స్ స్టాల్స్ ప్రారంభించనున్న హైకోర్టు జస్టిస్ సుజయ్ పాల్, తదితరులు


సమావేశంలో మాట్లాడుతున్న టీజీఎస్పీడీసీఎల్ సీఎండీ ముషారఫ్ ఫరూకీ

ప్రమాదకరమైన కేబుళ్లను తొలగించండి

- గుట్టలుగా ఉన్న కేబుల్స్‌తో వంగిపోతున్న స్తంభాలు
- టీజీఎస్పీడీసీఎల్ సీఎండీ ముషారఫ్ ఫరూకీ

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్‌లో ప్రధాన రహదారుల పక్కన విద్యుత్ స్తంభాలపై ప్రమాదకరంగా గుట్టలుగా ఉన్న కేబుళ్లను వారంలో, ఇతర రహదారుల్లో ఉన్న వాటిని రెండు వారాల్లో తొలగించాలని కేబుల్ ఆపరేటర్లను దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ సీఎండీ ముషారఫ్ ఫరూకీ ఆదేశించారు. ఖైరతాబాద్‌లోని టీజీఎస్పీడీసీఎల్ ప్రధాన కార్యాలయంలో బుధవారం కేబుల్ ఆపరేటర్స్, ఇంటర్నెట్ సర్వీస్ ప్రొవైడర్ సంస్థల ప్రతినిధులు, కేబుల్ అసోసియేషన్ల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎండీ మాట్లాడుతూ స్తంభాలపై నిబంధనల ప్రకారం కేబుళ్ల ఏర్పాటు చేసుకోవాలని ఆపరేటర్లకు సూచించారు. కరెంట్ స్తంభాలపై సామర్థ్యానికి మించి కేబుల్స్, తీగల బండిల్స్ పలు రకాల టెలీకాం పరికరాలను వేలాడదీయడంతో స్తంభాలు వంగిపోతున్నాయన్నారు. కేబుల్స్ చిందరవందరగా రోడ్లపైకి వేలాడుతూ ఫుట్‌పాత్‌లపై పడుతుండటంతో పాదచారులు ప్రమాదాలకు గురవుతున్నారని అన్నారు. సెక్షన్ల వారీగా పనిచేయని కేబుళ్లను తొలగించేందుకు క్షేత్రస్థాయి అధికారులతో కేబుల్ ఆపరేటర్స్, ఇంటర్నెట్ సర్వీస్ ప్రొవైడర్లతో సమావేశాలు నిర్వహించి తీగలు తొలగించే దిశగా చర్యలు తీసుకోవాలని సీఎండీ ఉన్నతాధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి డైరెక్టర్ కె.రాములు, సుధారాణి, జోనల్ చీఫ్ ఇంజనీర్లు కె.సాయిబాబా, నరసింహస్వామి, పి.ఆనంద్, బిక్షపతి, సీజీఎం నారాయణ, కేబుల్ సంఘాల నాయకులు, ఇంటర్నెట్ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

10, 11 తేదీల్లో జేఎన్‌టీయూలో మెగా జాబ్‌మేళా

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): పరవస్తు క్రియేటివ్ ఫౌండేషన్, జేఎన్‌టీయూ, నిపుణ హ్యూమన్ డెవలప్‌మెంట్ సొసైటీ, హెచ్‌ఆర్ కో ఆధ్వర్యంలో మెగా జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు పరవస్తు ఫౌండేషన్ నిర్వాహకులు తెలిపారు. జేఎన్‌టీయూ క్యాంపస్‌లో ఈనెల 10, 11 తేదీల్లో నిర్వహించే ఈ జాబ్‌మేళాలో ఐటీ, ఫార్మా, ఐటీఈఎస్, మేనేజ్‌మెంట్, బ్యాంకింగ్, ఎఫ్‌ఎంసీజీ, రిటైల్ రంగాలకు చెందిన 100కు పైగా సంస్థలు భాగస్వాములుగా ఉన్నాయని అన్నారు. ఈ జాబ్‌మేళాలో 10 వేల మందికి ఉద్యోగాలు ఇచ్చే అవకాశముందన్నారు. కనీసం టెన్త్, డిగ్రీ, పీజీ పూర్తి చేసిన వారు ఉచితంగా పాల్గొనవచ్చని, నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహకులు సూచించారు.

పిల్లల పోషకాహారంలో మార్పులు అవసరం

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): రెండేళ్లలోపు చిన్నారులకు అందించే పోషకాహార పద్ధతుల్లో మరిన్ని మార్పులు తీసుకురావాల్సిన అవసరం ఉందని యూనిసెఫ్ ప్రతినిధి డాక్టర్ జెలాలెమ్ టాఫెసర్ అన్నారు. యూనిసెఫ్, సీఎస్‌బీసీ(సెంటర్ ఫర్ సోషల్ అండ్ బిహేవిరియల్ చేంజ్) సంయుక్తంగా హెచ్‌సీయూలో బుధవారం నిర్వహించిన వర్క్‌షాప్‌లో ఆయన మాట్లాడారు. చిన్నారులకు మంచి పోషకాహారాన్ని అలవాటు చేయడం, వారి జుట్టు దువ్వడం, స్నానం చేయడం వంటి ప్రవర్తనల్లో చేయాల్సిన మార్పులను రూపకల్పన చేసేందుకు ఈ వర్క్‌షాప్ ఎంతగానో దోహదపడిందని అన్నారు. వర్క్‌షాప్‌లో యూనిసెఫ్ ప్రతినిధులతో పాటు తెలంగాణ రాష్ట్ర మహిళా, శిశు అభివృద్ధి శాఖ అధికారులు, పోషకాహార నిపుణులు, క్షేత్ర పరిశోధకులు పాల్గొని పరిపూర్ణమైన ఆహార పద్ధతులను ప్రోత్సహించడానికి వ్యూహాలను రూపొందించారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్రంలోని ఆదిలాబాద్, కామారెడ్డి, గద్వాల జిల్లాల్లో చేసిన క్షేత్ర పరిశోధనల్లో వెలుగుచూసిన అంశాలపై విస్తృతంగా చర్చించామని ఆయన తెలిపారు. వర్క్‌షాప్‌లో ప్రొఫెసర్ వాసుకి బెలవాడి, ఉషా రామన్, డాక్టర్ రవికాంత్ పాల్గొన్నారు.

శాంతి భద్రతల్లో పోలీసుల సేవలు ప్రశంసనీయం


సీఐ ఉపేంద్రను సన్మానిస్తున్న ఎంఆర్ఎస్ రాజు

దుండిగల్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ పోలీస్‌శాఖ అధికారుల ద్వారా మెలిటోరియస్ అవార్డు అందుకొన్న బాచుపల్లి సీఐ ఉపేంద్రను ప్రగతినగర్‌కు చెందిన బీజేపీ నేత డాక్టర్ ఎంఆర్ఎస్. రాజు బాచుపల్లి స్టేషన్‌లో బుధవారం సన్మానించారు. సందర్భంగా రాజు మాట్లాడుతూ.. శాంతిభద్రతల్లో రాజీలేకుండా సాక్ష్యాధారాలతో నిందితులకు పదేళ్ల జైలు శిక్ష విధించడంలో సీఐ కృషి చేశారన్నారు. కార్యక్రమంలో నాగిరెడ్డి, శేషారావు, ప్రసాద్, రాజు, అశోక్, శివప్రసాద్, తరుణ్, సాయికృష్ణ, అశోక్‌నాయిక్ పాల్గొన్నారు.

రూ.5 కోట్లు అప్పు ఇస్తామని ఆశపెట్టి టోకరా

- రూ.60 లక్షలతో పరారీ
- 24 గంటల్లో నిందితుల అరెస్ట్ చేసిన నల్లగొండ జిల్లా పోలీసులు

మిర్యాలగూడ, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): అప్పు ఇస్తామని చెప్పి ఓ ముఠా రూ.60 లక్షలను దోచేసింది. బాధితుడి ఫిర్యాదు మేరకు 24 గంటల్లోనే నల్లగొండ జిల్లా పోలీసులు నిందితులను పట్టుకుని డబ్బు రికవరీ చేశారు. బుధవారం నల్లగొండ జిల్లా మిర్యాలగూడ వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్పీ శరత్ చంద్ర పవార్ కేసు వివరాలు వెల్లడించారు. హైదరాబాద్‌లోని చందానగర్‌కు చెందిన మహ్మద్ అబ్దుల్‌సమీర్ నిజామాబాద్‌లో రియల్‌ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నాడు. కొత్త వెంచర్‌కు డబ్బు కోసం శ్రీకాంత్ అనే మధ్యవర్తి ద్వారా నల్లగొండ జిల్లా మిర్యాలగూడకు చెందిన కండెల గణేష్, కండెల మల్లికార్జున్‌ను సంప్రదించాడు. సమీర్‌కు అప్పుగా రూ.5 కోట్లు ఇవ్వడానికి వారు అంగీకరించి జూలై 31న రూ.90 లక్షలు ఇచ్చారు. సమీర్ నుంచి ఇంటి దస్తావేజులు, ప్రామిసరీ నోట్లు, బ్లాంక్ చెక్కులు తీసుకున్నారు. మిగతా డబ్బు కావాలంటే తాము ఇచ్చిన రూ.90 లక్షలు, అప్పు ఇవ్వబోయే రూ.5కోట్లకు వడ్డీగా రూ.60 లక్షలు ముందస్తుగా తీసుకుని ఈ నెల 5వ తేదీన మిర్యాలగూడకు రావాలని చెప్పారు. మరో ఇరువురు రియల్ ఎస్టేట్ వ్యాపారులను వెంట తీసుకుని సమీర్ వారి చెప్పినట్లుగానే రూ.కోటిన్నర నగదుతో అక్కడకు వెళ్లాడు. గణేష్, మల్లికార్జున్‌లు ఇంతకు ముందు ఇచ్చిన రూ.90 లక్షలు తీసుకొని చెక్కులు, ప్రామిసరీ నోట్లు, ఇంటి డాక్యుమెంట్లు సమీర్‌కు ఇచ్చేశారు. అనంతరం సమీర్ రూ.5 కోట్ల అప్పు గురించి గణేష్, మల్లికార్జున్‌లను అడగ్గా వడ్డీ డబ్బులు తెచ్చారా అని వారు ప్రశ్నించారు. దీంతో సమీర్ తన వెంట తెచ్చిన బ్యాగును తెరిచి రూ.60 లక్షలను చూపించబోయాడు. దీంతో గణేష్, మల్లికార్జున్‌తో పాటు మరో ఇద్దరు విజయ్, రాజు కలిసి సమీర్ అతడి స్నేహితులపై దాడి చేసి నగదు ఉన్న బ్యాగును తీసుకుని పరారయ్యారు. జరిగిన మోసాన్ని గ్రహించి సమీర్ అతడి స్నేహితులు నిందితులను వెంబడించే ప్రయత్నం చేయగా, గణేష్, మల్లికార్జున్ ముఠాకు చెందిన అనుపమ, వీరమ్మ, గంగమ్మతో మరికొందరు వారిపై దాడి చేసి పారిపోయారు. ఈ మోసంపై సమీర్ అదేరోజు రాత్రి వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వెంటనే స్పందించిన పోలీసులు డీఎస్పీ రాజశేఖరరాజు ఆదేశాల మేరకు వన్‌టౌన్, టౌటౌన్ సీఐలు సుధాకర్, నాగార్జున ప్రత్యేక బృందాలుగా ఏర్పడి నిందితుల కోసం గాలింపు చేపట్టారు. బుధవారం ఉదయం నిందితుల్లో కొందరైన అనుపమ, వీరమ్మ, గంగమ్మను పట్టుకుని వారి నుంచి రూ.60 లక్షల నగదు, డబ్బు లెక్కింపు యంత్రం, యాపిల్, రెడ్‌మీ స్మార్ట్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. మిగతా నిందితులు మిర్యాలగూడకు చెందిన కండెల గణేష్, మల్లిఖార్జున్‌లు హైదరాబాద్‌కు చెందిన విజయ్, రాజు, వీరన్న, గంగమ్మ పరారీలో ఉన్నట్లు ఎస్పీ తెలిపారు. పట్టుబడిన నిందితులపై గతంలో రాచకొండ కమిషనరేట్ పరిధిలోని ఎల్‌బీనగర్ పోలీస్‌స్టేషన్‌లో పలుకేసులు నమోదైనట్లు తెలిపారు. 24 గంటల్లో కేసును ఛేదించిన డీఎస్పీ, సీఐలను ఎస్పీ అభినందించారు.

నాణ్యమైన విద్యను అందించాలి

మియాపూర్, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు చిన్ననాటి నుంచే నాణ్యమైన విద్యతో పాటు అన్ని రంగాల్లో రాణించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని శేరిలింగంపల్లి, కూకట్‌పల్లి నియోజకవర్గాల కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జిలు జగదీశ్వర్‌గౌడ్, బండి రమేష్ అన్నారు. బుధవారం మియాపూర్‌లోని ప్రభుత్వ పాఠశాలలో యలమంచి ఉదయ్‌కిరణ్ యువసేన ట్రస్ట్ ద్వారా విద్యార్థులకు పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పాఠశాలల అభివృద్ధికి కృషి చేస్తోందని విద్యార్థులు లక్ష్యాలను ఎంచుకుని దానికి అనుగుణంగా ముందుకు సాగాలని పిలుపు నిచ్చారు. ఉన్నతస్థాయికి చేరుకుని తల్లిదండ్రులు, ఉపాధ్యాయులకు మంచి పేరు తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ లేబర్‌సెల్ చైర్మన్ నల్ల సంజీవరెడ్డి, వీరేందర్‌గౌడ్, మన్నేపల్లి సాంబశివరావు, కృష్ణగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

కేపీహెచ్‌బీ ఎల్‌ఐజీ ఫ్లాట్స్‌లో అగ్నిప్రమాదం


ఎల్‌ఐజీ ఫ్లాట్స్‌లో మంటలు

కేపీహెచ్‌బీకాలనీ, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): జేఎన్‌టీయూ టూ హైటెక్‌సిటీ వెళ్లే ఎంఐజీ బస్టాపు వెనకాల ఉన్న ఎల్‌ఐజీ ఫ్లాట్స్‌లో బుధవారం అగ్నిప్రమాదం జరిగింది. ఎంఐ ఆథరైజ్డ్ సర్వీస్ సెంటర్ నిర్వాహకులు గోదాం, సిబ్బంది కోసం ఎల్‌ఐజీ బ్లాక్ నంబర్ 16లోని 11, 12 ప్లాట్స్ అద్దెకు తీసుకున్నారు. మధ్యాహ్నం 12 గంటల సమయంలో దట్టమైన పొగలు రావడంతో పరిసర ప్రాంతాల్లోని నివాసితులు భయంతో ఇళ్ల నుంచి బయటకు పరుగులు తీశారు. మంటలు చెలరేగడంతో అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో ఫైరింజన్‌తో మంటలను అదుపులోకి తెచ్చారు. ఆయా గదుల్లో సర్వీసింగ్‌కు ఇచ్చిన మొబైల్ ఫోన్లు, బ్యాటరీలు, ఇతరత్రా పరికరాలు ఉంటాయని భావిస్తున్నారు. అగ్నిప్రమాదం వల్ల ఎంత నష్టం వాటిల్లిందనేది ఇప్పుడే చెప్పలేమని నిర్వాహకులు తెలిపారు.

నిథమ్‌లో టూరిజం టౌన్ హాల్ పేరిట కార్యక్రమం

రాయదుర్గం, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టూరిజం అండ్ హాస్పిటాలిటీ మేనేజ్‌మెంట్ (నిథమ్)లో పర్యాటక, అతిథ్య రంగాల గురించి తెలుసుకోవాలనుకునే వారికి బుధవారం సాయంత్రం 4 గంటలకు టూరిజం టౌన్‌హాల్ పేరిట ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పర్యాటక ప్రభుత్వం డైరెక్టర్ లాలా త్రిపాఠిలాస్, రాడిసన్ హోటల్ జనరల్ మేనేజర్, నోవాటెల్ కన్వెన్షన్ సెంటర్ జనరల్ మేనేజర్ రుబిన్ చెరియన్, తాజ్‌కృష్ణ ఏరియా ఆపరేషన్స్, జనరల్‌మేనేజర్ పంజక్ సంపత్ ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కార్యక్రమంలో పాల్గొన్న వారికి అతిథ్య రంగానికి సంబంధించిన మెళకువలపై అవగాహన కల్పించారు. అనంతరం వారి అనుభవాలు పంచుకున్నారు. పలువురి అనుమానాలను నివృత్తి చేశారు.

అందరూ విధిగా ఇంకుడుగుంతలను ఏర్పాటు చేసుకోవాలి


మొక్కలు నాటుతున్న జాన్ శాంసన్

దుండిగల్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): కొత్తగా ఇళ్లు నిర్మించుకొనే వారు తప్పని సరిగా ఇంకుడుగుంతలను ఏర్పాటు చేసుకోవాలని సీడీఎంఏ అడిషనల్ డైరెక్టర్ జాన్‌శాంసన్ తెలిపారు. దుండిగల్ మున్సిపల్‌లోని 28వ వార్డులో స్వచ్ఛదనం పచ్చదనం కార్యక్రమాన్ని కమిషనర్ సత్యనారాయణతో కలిసి ఆయన పరిశీలించారు. అనంతరం మొక్కలు నాటారు. వర్షపునీటి కాలువలను శుభ్రపరచుకోవడం, లోతట్టు ప్రాంతాల్లో మురుగునీరు నిలువ ఉండకుండా చూడడం, నీరు నిలుస్తున్న ప్రాంతాల్లో ఆయిల్ బాల్స్, యాంటీ లార్వా స్ప్రే చేయడం, వాటర్ ట్యాంకులను శుభ్రం చేసుకోవాలన్నారు.

చేనేత రంగాన్ని ప్రోత్సహించాలి

షాపూర్‌నగర్: జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకొని కుత్బుల్లాపూర్‌లోని పలు పద్మశాలి సంఘాల ఆధ్వర్యంలో చేనేత దినోత్సవాన్ని జరుపుకొన్నారు. సూరారం డివిజన్ కార్పొరేటర్ మంత్రి సత్యన్నారయణ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈసందర్భంగా కుల బంధువులతో మమేకమై చేనేత పరిశ్రమలను మరింత ముందుకు తీసుకువెళ్లాలని ప్రభుత్వాన్ని కోరారు. ప్రభుత్వం ప్రోత్సాహలు అందించాలన్నారు.

'స్వచ్ఛదనం-పచ్చదనం'లో దోమల నివారణ


మొక్కలు పంపిణీ చేస్తున్న జడ్సీ ఉపేందర్‌రెడ్డి

(జోన్‌బృందం- ఆంధ్రజ్యోతి)

స్వచ్ఛదనం- పచ్చదనం కార్యక్రమంలో భాగంగా మూడో రోజు ప్రజాప్రతినిధులు, నాయకులు వివిధ ప్రాంతాల్లో మొక్కలు నాటి దోమలు పెరుగకుండా మురుగునీటిలో ఆయిల్‌బాల్స్ వేశారు.

హైదర్‌నగర్‌లోని కూకట్‌పల్లి రామాలయం వద్ద ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు తులసి మొక్కలు పంపిణీ చేశారు. ఆల్విన్‌కాలనీ డివిజన్ పరిధిలోని ఎల్లమ్మచెరువు వద్ద ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ, డీసీ కృష్ణయ్య, కార్పొరేటర్ వెంకటేష్‌గౌడ్ మొక్కలు నాటి, దోమల లార్వా నిర్మూలన కోసం చెరువులో ఆయిల్‌బాల్స్ వేశారు. గాజులరామారం డివిజన్ ప్రభుత్వ పాఠశాల, బంధం చెరువులో మున్సిపల్ అధికారులు, విద్యార్థులతో కలిసి కార్పొరేటర్ రావుల శేషగిరి మొక్కలు నాటారు. కొంపల్లి మున్సిపల్ పరిధిలో మురుగునీరు నిలువ ఉన్న ప్రాంతాలను శుభ్రం చేశారు. రోడ్లపై గుంతలను పూడ్చడం, కమ్యూనిటీ నీటిట్యాంకుల వద్ద నీటిని బయటికి పంపి యాంటీ లార్వా స్ప్రేను చేపట్టినట్లు మున్సిపల్ కమిషనర్ క్రిశీహరి, స్పెషల్ ఆఫీసర్ ఎస్.వెంకటేశంలు తెలిపారు.

మానవ మనుగడకు పచ్చదనమే ప్రధానమని శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్ ఉపేందర్‌రెడ్డి అన్నారు. అందరూ ప్రశాంతమైన జీవితం గడిపేందుకు ఆరోగ్యకరమైన వాతావరణంతో ముడిపడి ఉందని, అలాంటి వాతావరణం పెంపొందించడంలో అందరూ తమవంతు కృషి చేయాలని జోనల్‌కమిషనర్ పిలుపు నిచ్చారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు మొక్కలు నాటడమే కాకుండా వాటిని సంరక్షించాలన్నారు. ఆయన మొక్కలు నాటారు. అనంతరం స్థానికులకు మొక్కలు పంపిణీ చేశారు.

తెలంగాణ ప్రజలకు ఆర్టీసీ బంపర్ ఆఫర్

ఫతేనగర్, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): శుభకార్యాలు, విహారయాత్రలు, దూర ప్రాంతాల వెళ్లేవారి కోసం టీజీఆర్టీసీ బంపర్ ఆఫర్‌ను అందజేస్తోందని కూకట్‌పల్లి ఆర్టీసీ డీఎం డి.హరి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వేడుకలకు హాజరయ్యే వారికి కాంట్రాక్టు పద్ధతిలో బీవోసీ చార్జీలో 10 శాతం రాయితీ ఇస్తూ బస్సులు అద్దెకు ఇస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ రాయితీ సెప్టెంబర్ 3వతేదీ వరకు (రాష్ట్ర వ్యాప్తంగా) ఉంటుందన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. వివరాల కోసం 9959226151లో తెలుసుకోవచ్చని సూచించారు.

ఘనంగా బొడ్రాయి ప్రతిష్ఠ


బోనాలతో రవికుమార్‌యాదవ్ కుటుంబసభ్యులు

గచ్చిబౌలి, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): శేరిలింగంపల్లి మసీద్‌బండ గ్రామంలో బొడ్రాయి ప్రతిష్ఠ కార్యక్రమం బుధ వారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ పాల్గొన్నారు. అంతకు ముందు మాజీ ఎమ్మెల్యే భిక్షపతియాదవ్, శేరిలింగంపల్లి బీజేపీ ఇన్‌చార్జి రవికుమార్‌యాదవ్ కుటుంబసభ్యులు అమ్మవారికి బోనాలను సమర్పించుకున్నారు. సదానంద్‌యాదవ్, రాజుయాదవ్, మల్లేశ్, ఎల్లేష్, రాజు, రాము, సైదేశ్వర్‌రావు పాల్గొన్నారు.

- కొండాపూర్ డివిజన్ ఓయూ ప్రొఫెసర్స్‌కాలనీలో సమస్యలు దశలవారీగా పరిష్కరిస్తామన్నారు. జీహెచ్‌ఎంసీ అధికారులు, స్థానికులతో కలిసి కాలనీలో ఎమ్మెల్యే పర్యటించారు. తాగునీటి వసతి, యూజీడీ పైపులైను, రోడ్ల సమస్యలు పరిష్కరించాలని ఎమ్మెల్యేను స్థానికులు కోరారు.


వివేక్‌నగర్‌లో బ్యాగులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

ప్రభుత్వ విద్యార్థులకు బ్యాగుల పంపిణీ

కేపీహెచ్‌బీకాలనీ, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): చదువుకు పేదరికం అడ్డుకాకూడదని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. ఈ మేరకు బాలాజీనగర్ డివిజన్ పరిధి వివేక్‌నగర్ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు తన సొంత నిధులతో సమకూర్చిన బుక్స్, స్టేషనరీ, వాటర్ బాటిల్స్, బ్యాగ్స్‌ను బుధవారం కార్పొరేటర్ పగుడాల శిరీష బాబురావుతో కలిసి ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సృజన, డివిజన్ అధ్యక్షులు ప్రభాకర్‌గౌడ్, ప్రధానకార్యదర్శి వెంకటేష్ చౌదరి, కాలనీ అధ్యక్షులు ముత్యపాగ శ్రీనివాస్, కార్యదర్శి అనిల్ కుమార్ తదితరులు పాల్గన్నారు.

నియోజకవర్గ సమస్యలు పరిష్కరిస్తా: కూన

షాపూర్‌నగర్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారమే కాంగ్రెస్ పార్టీ లక్ష్యమని మాజీ ఎమ్మెల్యే, ఆ పార్టీ రాష్ట్ర నాయకులు కూన శ్రీశైలంగౌడ్ అన్నారు. బుధవారం షాపూర్‌నగర్‌లోని ఆయన నివాసానికి పలు కాలనీలు, పార్టీల నాయకులు, కార్యకర్తలు తరలివచ్చి సమస్యలు విన్నవించుకొన్నారు. బాచుపల్లిలోని పూజిత ఎంక్లేవ్ కాలనీ అసోసియేషన్ నూతన కమిటీ సభ్యులు శ్రీశైలంగౌడ్‌ని కలిశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గంలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కటుబడి పని చేస్తామన్నారు. గాజులరామారం డివిజన్ పిపినగర్‌కు చెందిన మహిళలు కమ్యూనిటీహాల్‌ని కేటాయించాలని కోరారు.

ఆధార్ కేంద్రాన్ని పునఃప్రారంభించాలి

బాలానగర్, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): బాలానగర్ డివిజన్ ఫిరోజ్‌గూడ కమ్యూనిటీహాలులో ఆధార్ నమోదు కేంద్రాన్ని పునఃప్రాంరంభించాలని బాలానగర్‌కు చెందిన పలు పార్టీల నాయకులు తహసీల్దార్‌కు వినతిపత్రం బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ.. మూడేళ్లుగా వార్డు కార్యాలయంలో ఆధార్ నమోదు కేంద్రం అందుబాటులో ఉండేదని, సాంకేతిక లోపాల వలన సెంటర్ తీసేసారని వారు గుర్తుచేశారు.

20 ఏళ్లకే దారిదోపిడీలు, రౌడీషీట్

- ఐదుగురి అరెస్టు

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): 20 ఏళ్లకే దొంగతనాలు, దారిదోపిడీలకు పాల్పడుతూ.. ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్న ఓ రౌడీషీటర్ సహా.. ఐదుగురిని సౌత్‌వెస్ట్ జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు, కల్సుంపురా పోలీసులు కలిసి అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. బుధవారం టాస్క్‌ఫోర్స్ డీసీపీ సుదీంద్ర తెలిపిన వివరాల ప్రకారం.. కామాటిపురాకు చెందిన చౌకత్ ఆకాశ్ 20 ఏళ్లకే హత్యకేసు, దారిదోపిడీ కేసులో అరెస్టయ్యాడు. దాంతో అతనిపై రౌడీషీట్ నమోదైంది. ఆ తర్వాత మరో నలుగురు స్నేహితులు పర్సా విశాల్‌సింగ్, బిరదారా కిషన్‌రావు రోహిత్, సకత్ జితేందర్, గున్నాల ప్రదీప్‌తో కలిసి ముఠాగా ఏర్పడ్డారు. వారంతా 20 ఏళ్ల యువకులే. నగరంలో అర్ధరాత్రి తిరుగుతూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేసి కత్తులతో బెదిరించి దారిదోపిడీలకు పాల్పడుతున్నారు. ఈ క్రమంలో అర్ధరాత్రి స్నేహితునితో కలిసి వెళ్తున్న డెలివరీ బాయ్‌ని అడ్డగించి కత్తులతో బెదిరించి, గాయపరిచి వారి నుంచి సెల్‌ఫోన్‌లు, నగదును లాక్కున్నారు. దాంతో సౌత్‌వెస్టు జోన్ పోలీసులు రంగంలోకి దిగి నిఘా పెట్టి రౌడీల ముఠాను పట్టుకున్నారు.

ఐపీఓ ఇన్వెస్ట్‌మెంట్ పేరుతో
రూ. 6.14 లక్షలు లూటీ

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): ఐపీఓలలో పెట్టుబడి పెడితే అధిక లాభాలు ఆర్జించవచ్చని ఆశ పెట్టిన సైబర్ నేరగాళ్లు నగరవాసి(58) నుంచి రూ. 6.14 లక్షలు కాజేశారు. నగరవాసిని వాట్సాప్‌లో సంప్రదించిన సైబర్ నేరగాళ్లు ఐపీఓలో పెట్టుబడులు పెడితే తక్కువ సమయంలోనే ఎక్కువ లాభాలు వస్తాయని నమ్మించారు. ఇలా పలు సంస్థల ఐపీఓలలో పెట్టుబడుల పేరుతో రూ. 6.14 లక్షలు పెట్టించారు. పెట్టిన పెట్టుబడికి లాభాలు వచ్చాయని చూపారు. లాభాలు తిరిగి పెట్టుబడిగా పెట్టాలని సైబర్ నేరగాళ్లు ఒత్తిడి చేశారు. తన డబ్బులు విత్‌డ్రా చేసుకునే అవకాశం లేకపోవడంతో బాధితుడు సైబర్ నేరగాళ్లను సంప్రదించాడు. ఖాతాలో ఉన్న డబ్బులో 10 శాతం చెల్లిస్తేనే విత్‌డ్రాకు అవకాశం ఇస్తానని చెప్పడంతో మోసపోయానని గ్రహించిన బాధితుడు సైబర్ క్రైం పోలీసులకు ఫిర్యాదు చేశాడు.